ఓం

# మృత్యుంజయుడు

పద్య కావ్యం

**గెడ్డాపు సత్యం**
విశ్రాంత ఆంధ్రోపన్యాసకుడు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఎమెస్కో

ఓమ్

# మృత్యుంజయుడు

## పాశుపత ఖండము

మ॥ అరవిందంబునఁ జిక్కి జుమ్మని యార్తారావముంజేయు బం
భరపోతంబు మనోముదంబు దగులం బత్రంబు లాత్రంబుగాఁ
దెఱచెం బూర్వ ధరాధ్ర మందుదితుడౌ తేజస్వి భానుండు శాం
కర మంత్ర ధ్వని బోలి విన్చె నళి ఝుంకారంబు శైవాళికిన్ 1

తే.గీ॥ లోక బాంధవు కరుణావలోకనమున
సమ్మదంబునఁ బొదలు నా చంచరీక
పోతమున్ బ్రశంసలఁ దేల్చు పోల్కి నులిసె
శుకపికాది విహంగమ ప్రకర మపుడు॥ 2

తే.గీ॥ తమ్మి చెఱ నుండి విడుదలై నెమ్మినలరు
కొదమ తేటికి నివ్వాళి గూర్చునట్లు
రవి కరంబులు వెలుగులు రమణ నెఱపి
యుత్సవము నిర్వహించె లోకోత్సవముగ॥ 3

తే.గీ॥ శిశిర హిమశీత ఘనరస సేకముునను
దిసమొలగఁ జేసి తరు సంతతి తలగడిగి
యొడలు తడియార్చి క్రొంగ్రొత్త బెడగు దోప
బ్రాతిఁ గైసేతకుఁ దొడంగెఁ బ్రకృతి మాత॥ 4

తే.గీ॥ మ్రోడయిన మావిఁ జేరగా బోయి కొమ్మ
లంటి వలపును బసికట్టి యచిర మందె
రుచిరమగు ప్రవాళంబుల రుచి లభించు
ననుచు నార్చిన యటు కుహూ యనియెఁ బికము 5

తే.గీ॥ శిశిరమున "ఉహుహూ" యను శిథిల తనులఁ
గేలి సేసిన యటు దోచె నాలి పికము
"కుహుకుహూ" యని పలుమాఱు కూతలిడుట;
యవసరము బట్టి శబ్దంబు నర్థమమరు. 6

ఉ॥ స్థాణువు లెల్ల స్థాణువు నెదంగొని నిశ్చలతన్ భజించి గీ
ర్వాణులు మెచ్చ నద్భుత తపంబొనరించి సరూపతాఖ్య ని
ర్వాణము బొందినట్లు నవ పల్లవ తామ్ర శిఖా జటా యుతిన్
స్థాణుని సామ్య మందెను వసంత సమాగమ హర్షలబ్ధిచే 7

తే.గీ॥ పరమ పావనమైన యా ప్రకృతి నడుమఁ
గలదు మునిపల్లె యొకటి నిష్కలుష మగుచు
మహిత పంచాక్షరీ మంత్ర మనన పరులు
మునులు నివసింతు రచ్చోట ముదము తోడ 8

చ॥ వినుత తపోధనుల్ ప్రయత వృత్త మనోరము, లచ్ఛ భావ పా
వనులగు సంయమీంద్రులట వాసము సేయుదు, రట్టివారిలో
ముని వరుడొక్కడుండు ననుమోదముతో నిజపత్ని గొల్వ శం
భుని మది నమ్మి, సంతత తపో విభవంబున సంయతాత్ముడై 9

ఉ॥ ఆతడు సర్వమున్ శివమయంబని భావనసేయుఁ, గార్య సం
ఘాతము లెల్ల శంకరుని కల్పనగాఁ దలపోయు, సౌఖ్య సం
జాతములెల్ల నీశ్వరు ప్రసాదముగా గ్రహియించు, సంకట
వ్రాతము లెల్ల పూర్వ కృత పాప ఫలంబులుగాఁ దలంచెడున్ 10

క॥ మృత్యుంజయ పద నిత్య
స్మృత్యర్పిత చిత్తవృత్తి మిగిలిన యతనిన్
స్తుత్యర్చన విధులం ద
త్రత్యర్షిగణంబు గొల్చి ధన్యత బొందున్ 11

తే.గీ॥ పరమ సుకుమారమైన భావంబు కలిగి
యెవ్వరికి బాధ గల్గిన నొవ్వఁ జెందు;
నెల్లరికి సౌఖ్యముం గూర్ప నిందు ధరునిఁ
బ్రార్థనము సేయు నాతండుదాత్త బుద్ధి. 12

తే.గీ॥ జీవితంబెంత యల్పమో చింతసేయ
జీవనం బెంత క్లిష్టమో భావమందుఁ
దఱచు తలపోసి యాతండు పరమ విభుని
శరణు గోరెడు, భక్తి సంభరిత మతిని 13

క॥ ధ్యానస్థితుడగు నాతని
మేన మృగము లొరసి కొనుచు మేకండూతిన్
బోనాడగ నా యాశ్రమ
మౌనులు పిల్చిరి మృకండు మౌనీ! యనుచున్ 14

క॥ అన్యులు గీడాడిన మది
మన్యువునకుఁ దావొసంగి మథన పడడు, ధీ
మాన్యత నాత్మ విమర్శన్
ధన్యతఁ బొందంగఁ దలపుఁ దార్చును బుద్ధిన్ 15

క॥ తన నన్యులు గొనియాడినఁ
దన యర్హతఁ గూర్చి మదినిఁ దలపోసి లవం
బునుఁ గర్వపడడు భగవం
తుని కరుణగఁ దలచి యతని నుతి గావించున్ 16

క॥ ప్రతి సంఘటనము గిరిజా
పతి నిర్దేశముగఁ దలచుఁ బ్రతి నిమిషంబున్
మతిఁ గీర్తించును శివును
స్నుతి, నాతని సత్కృపా సనాథత్వంబున్ 17

క॥ ఆతని సతి కరుణామతి,
పాతివ్రత్య ప్రభావ భవసతి, విద్యా
పూతోన్నతి, హంసీగతి
యై తనరు మరుద్వతీ సమాహ్వాయ యుక్తిన్ 18

క॥ ఆయమ శుభలక్షణయుత
మాయా రహిత ప్రవృత్తి మహితత్వముతో
శ్రేయఃప్రద సాధ్వీ గుణ
భూయస్త్వము గృహిణు లెల్లఁ బొగడగ నొప్పున్. 19

క॥ గృహిణుల తలమానికమై
రహియించెడి యామె పుత్ర రాహిత్యమునన్
బహు దుఃఖముతో నలగుచు
నహరహము మెలంగు జీవయంత్రము పోలెన్ 20

ఉ॥ పుత్రులు లేని వారలకుఁ బుట్టవు సద్గతులంచు, సత్ప్రజా
సూత్రము త్రెవ్వరాదనుచు సూరులు చెప్పగ నాలకించుచో
సత్రపయై, యధీరయయి సాటి తలోదరులందు నిల్వ నే
మాత్రము నిచ్చగింపదు, కుమారిలు నెంతయుఁ జిన్నవోవుచున్ 21

క॥ ఆ కన్నుల దీనత్వము
నా కదలికలోని నిస్స్పృహత్వముఁ జూడన్
లేక, మృకండుడు మదిలోఁ
గాక పడున్ మిగుల, దైవగతిని దలంచున్ 22